


# నయనతార

—'జెమిని'

అప్పిస్తావా?' అని ప్రాణం పోయినా అడగకూడదు. వెధవ, ఎరగనట్టుగా అంగారక గ్రహం నుంచి దిగిన వింత పురుగుని చూస్తున్నట్టు కొత్తగా చూస్తున్నాడు.'

'కాపోయినా, వెధవది పాతిక పైసలు అప్పేమిటి?'

'సినిమా చూడటానికి!'

'సినిమా ఎందుకు చూడాలి?'

'పాత మొహాల్ని, పాత జీవితాల్ని గుర్తు చేసుకోటానికి!'

'గుర్తు చేసుకోటం దేనికి?'

'మరుగుపడిపోయిన ఆనందాన్ని మనస్సులో నింపుకోటానికి!'

'ఆనందం నింపుకుని ఏం చెయ్యాలి!'

'వల్లకాడుకి పోవాలి!'

'నిజం, నిజం! అక్కడే బోల్డంత సుఖం ఉంది.'

'లేబ్‌లో సులోచన చెయ్యి పట్టుకున్న ఆచారి, రీజినల్ రిసెర్చ్ లేబొరేటరీలో సైంటిస్టు.'

'కాయితం, కలం పెట్టి భానుమతి దేవికి కవితాగానాన్ని వినిపించిన వెంకటగిరి, కలక్టరేట్‌లో యల్. డి. అసిస్టెంటు.'

'గొంగళి ...'

'యస్, సార్!'

"ఇదుగో, ఈ తొంభై రూపాయల్ పైకం తీసుకువెళ్లి ఇక్కడ తల తాకట్టు పెట్టు."

"మహాప్రసాదం!"

"అయ్యా, వనేనా ధర్మం. . ."

'ఒక్క పాతిక పైసలు, సార్. కొత్తగా రెక్కలు వచ్చిన రోజుల్లో పచ్చగా కనపించిన ఈ పసిడి లోకాన్ని పసిపాపలా చూసినప్పటి చిత్రం!'

'అందులోని హీరోయిన్ [illegible], లంగా కట్టి గెంతదు, బాబయ్యా!'

'పిండా పై వేసుకుని, స్త్రీత్వంగా, మల్లెపువ్వులా, మంచి మనసులా, కారుణ్య దేవతలా, తెలుపూ నలుపూ, బొమ్మా బొరుసూ తెలీని వెంకటగిరి హీరోని చూసి నవ్వుతాదండీ!'

భానుమతి పాలపిట్ట రంగు చీర కట్టుకుని, మోచేతులదాకా ఉండే మీగడ రంగు రవిక కట్టుకుని అందంగా, తీవిగా, రావకన్నెలా ఆవేళ సినిమాకి వచ్చింది.

గాబర్డిన్ మూట్‌లో, రాజ్‌కపూర్ క్రాపింగ్‌తో, బూటూ బూటు వేసుకుని ఫుల్ స్వింగ్‌లో, వక్కవ ఎడ్వర్డ్ రాజ కుమారుళ్ళా తను కూచున్నాడు.

కింగ్ ఎడ్వర్డ్ బొమ్మగల నాణేనికి లాస్ పడింది. బొమ్మ బొరుసయింది.

దీపాలారిపోయాయి. వెండి తెరమీద కథానాయకి భానుమతిలా వచ్చిం

భానుమతి చెక్కిళ్ళు చీకట్లో కూడా కాంతివంతంగా కనిపించాయి.

హీరో రాజ్‌కపూర్ మంచినీళ్ల కోసం అల్లాడిపోతున్నాడు. పూటుగా తాగేసి, మల్లెదండ దండకి కట్టుకున్న రసికాగ్రణి ముందుకీ వెనక్కీ అడుగేస్తూ, బుడ్డీలోని అమృతం తాగమని బలవంతం చేస్తున్నాడు.

వెంకటగిరి లాంటి హీరో కాబట్టి, మంచి బాలుడు మంచినీళ్లే కోరును కాబట్టి అతను తాగడు.

అతని నిజాయితీకి వెంకటగిరికి జాలేసింది. గంభీరంగా చెమర్చిన కళ్లని రుమాలుతో తుడుచుకున్నాడు.

ఇంకా బోలెడు నోట్లు తాగుడుగాడి జేబులోంచి జారిపోయాయి.

“పో! తీసుకుని మజా చెయ్, కుర్రాడా. కుర్రదాన్ని వెతుక్కోపో!”

“వద్దండీ, నాకు మంచినీళ్లు ఇప్పిస్తే చాలు.”

రెండోసారి వెంకటగిరికి తాగుడుగాడిమీద పీకబంటి కోపం వచ్చింది. దొంగవెధవ, వాడి నిజాయితీని కలుషితం చేస్తున్నాడని తిట్టుకున్నాడు.

భానుమతి రుమాలు అడ్డం పెట్టుకుని నవ్వుతూంది.

తెరమీది బొమ్మ క్షణం కనిపించటం మానేసింది.

అందంగా మలిచిన శిల్పం ప్రాణం పోసుకుని చీకటి గుహల్లో కదిలినట్టుగా కనిపించింది వెంకటగిరికి.

ఆమె రాసుకున్న లవెండర్ వాసన శ్వాసకోశంలోంచి గుండెల్లోకి, అక్కణ్ణించి రక్తంలోకి ప్రవహించి, వెంకటగిరికి వెచ్చటి మత్తులాంటి సుఖాన్ని కలిగించింది.

అంతకుమించిన సుఖానికి అటుపైన పదేళ్లలోనూ చేరువకాని, కాలేని వెంకటగిరి శరీరం చుర్రుమంది. చుట్టా, బీడీ, సిగరెట్ వెలిగించుకునే నిమిత్తం వేలాడతీసిన, హోటల్ ఎదురుగా ఉన్న నాయుడు కొట్టులోని నిప్పుతాడు, గతాన్ని నెమరువేసి, సుఖాన్ని వెతుకుతూ బడ్డీకి అనుకుని నిల్చున్న వెంకటగిరికి, మాడి మసి అయిపోయిన జీవితాన్ని గుర్తుచేస్తూ, మంటలోని సుఖాన్ని అన్వేషించమంది.

హోటల్ గదిలోని గోడకున్న ఆటోమాటిక్ గడియారం, దూరంలో నుంచున్న వెంకటగిరికి విండో ఫ్రేమ్‌లోంచి, ఫ్రేమ్‌కున్న గాజు తలుపుల్లోంచి, పట్టపగలుగా లైట్లతో ప్రకాశిస్తూన్న, ప్రతిఫలిస్తూన్న బ్లాడిస్టెంపర్ రంగుల మధ్యలోనించి ఏడున్నర చూపించింది.

జనం పల్చబడడంతో బట్లర్ ఉన్నితన్ ఉమ్మేకునేందుకు బైటికి వచ్చి మేనేజర్ కంటబడకుండా బీడీదమ్ములు రెండు లాగి అవతల పడేశాడు. ఎండుపుల్లల్లా, ఎముకలగూడుల్లా ఉన్న ఇద్దరు ముష్టివాళ్లు సగం కాల్చిన బీడీ మీదికి గద్దల్లా వాలారు.

హోటల్ మెట్లకి పక్కగా కూచుని, సిగరెట్‌ని వేళ్ల మధ్య ఉంచి, గట్టిగా దమ్ము లాగి, నిమీలిత నేత్రుడై, ఆలోచనా మనస్కుడై, బలిసిన కొంగలాంటి వాడై చెలగుతున్న కపూర్ బిచ్చగాడు అణాకోసం జపం చేస్తున్నాడు.

'వాతావరణం అంతా ఉక్కగా, దుమ్ముగా, చీదరగా, మంటగా ఉంది' అనుకున్నాడు వెంకటగిరి.

'కాలమనేదాని రెక్కలు విరగగొట్టి, కుత్తుక ఉత్తరించి, కత్తిగంటు సినిమా విలన్‌లా మీసం మెలేస్తే ఏమగునహో?' అనుకున్నాడు.

'లేకపోతే, కమలాకరం బావగాణ్ణి రెక్కుచ్చుకుని లాక్కువచ్చి, రెండుగా చీల్చేసి, భస్మీపటలం చేసి, అంతవరకూ తను పుచ్చుకోని, బుచ్చిరాజు పుచ్చుకోకుండా నిలవలేని నికార్సయిన కల్తీలేని బ్రాందీలో కలిపేసి తాగేస్తే ఎలా ఉంటుంది?' అని కసిగా, కరువుతీరా అనుకున్నాడు.


'అభినవ దేవయాని, ఆ త్వాష్ట్రుడుగాణ్ణి మంత్రం వేసి బ్రతికించేస్తుందేమో?'

'వెధవది, ఇంత ఆలోచించకుండా ముందులోనే లైట్లారిపేశాక బెంచీలో కుదిరిపోయి ఉంటే బావుణ్ణు. పాత సినిమాయే కాబట్టి, కాళ్లు చాపి, పాదుషాలా కూచున్నా అడిగేవాడు లేడు'

కాని, పాతిక పైసలు అప్పు పుట్టించలేని వెంకటగిరి, బి. ఎ., పాతికేళ్లుగా వేళ్లు తన్నుకుపోయినవాడు కాబట్టి అతడిని గుర్తుపట్టని పురజనవాసుడు లేడు.

పది రోజులు పచ్చి మంచినీళ్లు తాగి బతికినా తఖర్‌లేదు. కాని, బడ్డీకొట్టు నాయుడులా, కానిస్టేబులు అప్పలకొండలా రొమ్ము విరుచుకుని పైలాపచ్చీస్‌గా విజిలేసుకుంటూ, రుమాలుతో దుమ్ము దులుపుకుంటూ బెంచీ సీట్లో బైఠాయించటానికి వెంకటగిరి, బి. ఎ., సుతరామూ ఒప్పుకోడు.

నాయుడుకి పాతికవేలు చేసే సరుకున్న కొట్టుంది. వెంకటగిరికి పాతిక పైసలు లేకపోయినా కలకటేరు ఆఫీసులో బెత్తుతో అల్లిన కొయ్య కుర్చీ ఉంది.



దాహ శాంతికి

ఫొటో – ఎ. అమ్మాజీ (నెల్లూరు)

మన సినిమా హాల్లో మెత్తని కుషనేసిన కుర్చీలో, మొత్తం వెలుగుతూన్న దీపాల పవర్ అంతటినీ ధిక్కరిస్తూ, హెలెన్ ఆఫ్ ట్రాయ్‌లా, క్లియోపాత్రాలా, మహారాణిలా మెరిసిపోతూన్న భానుమతి చుట్టూతా ప్రదక్షిణం చేస్తూంది.

భానుమతిని ఇంటర్వెల్‌లో అడిగాడు: “పిక్చర్ చాలా బావుంది కదూ?”

“ఏడిసినట్టుంది.”

“అవును, పాపం. హీరోకి ఎన్ని కష్టాలు! మంచినీళ్లకోసం ఎంత అవస్థ పడ్డాడు! ఎన్ని అవకాశాలు వచ్చినా నీతి తప్పకుండా, హీరోయిన్‌ని ముట్టుకోకుండా . . .”

“టట్! మొరాల్టీ పేరుతో చవట హీరోని తెచ్చి డైరెక్టర్ బోరు కొట్టించాడు.”

“ఐతే నీకు కత్తి యుద్ధాలు, కొండల మీంచి పల్టీ కొట్టడాలు ఉంటే ఇష్టమన్న . . .”

“అందులో అందమైన అమ్మాయిని ఎత్తుకుపోయి ప్రేమించటం కూడా చేర్చు...” వెంకటగిరికి అంత సూటిగా, ఖచ్చితంగా అనేసిన భానుమతి కళ్లలోకి చూడటానికి ఒక్క క్షణం భయంవేసింది.

'ఇది నిజంగా రాచపిల్లే ...' అని అనుకున్నాడు.

అమకుని సినిమా వదిలేసిం తరవాత భానుమతి ఇంటి దగ్గర గేటు ముందు వెన్నెల్లో విరగబూచి పరిమళాన్ని వెదజల్లే పవ్వజాజి పందిరి పక్కగా, బంగారంలా మిలమిలా మెరిసిపోయే సున్నితమైన చెయ్యి పట్టుకుని, అదాటున ముద్దు పెట్టుకుని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లిపోయాడు.

అప్రతిభురాలైన రాజకుమారి ఆశ్చర్యాన్నంతా పోగుచేసుకుని అతను వెళ్లినవేపే విభ్రమంగా చూస్తూ, అతను మలుపు తిరిగేదాకా నిల్చుండిపోయింది.

ఆ తరవాత రెండు రోజులకి వాళ్ల మామయ్యగా రుంటున్న అనంతపురానికి వెళ్లిపోయింది.

తియ్యటి అనుభవమనే మహిమగల పాదలేపనం పూసుకుని ఆ రెండురోజులు ప్రపంచంతో నిమిత్తం లేకుండా మంచునీ, మబ్బుల్నీ చీల్చుకుని గంధర్వ రాజకుమారుల్లా తిరిగేసిన వెంకటగిరి మరి భానుమతిదేవిని చూడ నోచుకోలేదు.

అనంతపురంనించీ ఆమె రాకుండానే ఆమె నాయనగారు ట్రాన్సఫరై సకుటుంబ బంధు మిత్ర పరివారంతో అనంతపురానికి తరలిపోయారు.

మంచి శుభలగ్నంలో భానుమతికీ, అనంతపురంలోనే ఇంజినీరింగ్ ఫైనల్ చదువుతూన్న కమలాకరం బావకి అనంత వైభవంతో వివాహం జరగబోతుందని కూడా భానుమతి దూరపు బంధువు, వెంకటగిరికి క్లాస్‌మేటూ అయిన బుచ్చిరాజు వెల్లడి చేశాడు.

వెంకటగిరి మూడు రోజులు భోజనం ముట్టలేదు. మూడు వేలదాకా గడ్డ

గీసుకోకుండా ఏనుగు తలుపులు బిగించి చూరుకేసి చూస్తూ, రాత్రుళ్ళు నాగావళీ నదీతీరం పొడుగునా ఉన్న ఇసుకలో నడుస్తూ, పొరపాటున ఎవరైనా పలకరిస్తే జీవంలేని నవ్వు విసిరేవాడు.

రిజల్ట్సు వచ్చాక ఫస్ట్ క్లాస్‌కి ఒక్క మార్కులో తప్పిపోయినందుకు విచారించ లేదు.

న్యుమోనియా వచ్చి గ్రామంలో తండ్రి పోయినప్పుడు, అప్పులు పెంచి చేతికి చిప్ప మిగిల్చినప్పుడు గుండె పగిలేలా ఏడవనూ లేదు.

అప్పుడప్పుడు వీలు చిక్కినప్పుడు, భానుమతి వాళ్ళ పాత ఇంటి పక్కనించి, కాలనీ ట్రయాంగిల్ పార్కు మీదిమించి తిన్నగా నడుచుకుపోయి మండల రావు కోనేటి గట్టుమీద బాగా చీకటి పడేదాకా కూచుని, ఆ తరవాత ఇంటికి వెళ్ళిపోయేవాడు.

న్యూ ఇయర్‌కి బజారల్లా తిరిగి ఖరీదయిన అందమైన గ్రీటింగ్ ఒకటి ఎంచి, తన పేరుమాత్రం రాయకుండా, ప్రతి సంవత్సరం భానుమతి వెళ్ళిపోయిన అనంతపురం అడ్రస్‌కి తప్పనిసరిగా పోస్టు చేసేవాడు.

వెంకటగిరికి గడిచిపోయిన పదేళ్ళూ రిప్ వాన్ వింకిల్‌కి పట్టిన మాయ నిద్రలాంటిది.

ఆఫీసు, బడలిక, చీకటి, దరిద్రం, వయస్సూ, కోరికా—తాత్కాలికంగా కొంత బాధ కలిగించి, కొంత విరక్తి కలిగించినా అతని జీవిత స్రవంతిలో ఎదురయ్యే గడ్డిపోచల్లాంటి వని.

అతనేగాని పికాసో అంతటి గొప్ప చిత్రకారుడై ఉంటే పదేళ్ళ క్రిందట భానుమతి చిత్తరువుని పది నిముషాల్లో వేసి ఆమె బుగ్గల్లోని నవనవని, కళ్ళల్లోని మెరుపుని కళ్ళకి కట్టేట్టు కళాఖండంగా రూపొందించగలడు.

వెంకటగిరి హోటల్లోకి ఇంకో సారి దృష్టి సారించాడు.

తొమ్మిది చూపుతూంది గోడ గడియారం.

'అయిపోయింది. ఇంకో అర గంటలో సినిమా వదిలేస్తారు. అచ్చంగా భానుమతిలా కనిపించే కథానాయికి పతాక సన్నివేశంలో హీరోని కలుస్తుంది.'

'తను మరి భానుమతిని చూసే అదృష్టానికి కనీసం నోచుకోలేకపోయాడు.'

'కథానాయికీ, భానుమతి రూపులో ఒక్కలాగే ఉన్నా, స్వభావంలో ఊహించ నంతటి దూరం. ఆమె కరుణాంతరంగ ఉరిపోసిని. ఈమె ఉత్తుంగ తరంగ మహోల్లాసిని.'

వెంకటగిరి తల ఎత్తి ఒక్కసారి ఆకాశంకేసి చూశాడు. నక్షత్రాలు స్పష్టంగా, జిలుగు జిలుగుమని యౌవనంతో గంతులేస్తున్నాయి. శీతాంశుడు చిరునవ్వు నవ్వుతూ వాళ్ళతో సరాగమాడుతున్నాడు.

కాళ్ళు నెప్పులు పెడుతున్నాయి. ఎడం పాదం తిమ్మిరెక్కినట్టుగా కూడా ఉంది. కడుపులో పేవులు కీచుకీచుమని మూలిగి, చేసేది లేక ఊరుకుంటున్నాయి. కాని వెంకటగిరి పట్టించుకోలేదు.

'వెధవ ఆకలి. దీనికి వేళాపాళా ఉండదు గామోసు' అని అనుకున్నాడు.

'ఆకలి మాట దేవుడెరుగు. అనవసరంగా చక్కని సినిమా మిస్ అయ్యాను.'

'భానుమతి మెళ్ళో తాళికట్టిన కమలాకాంతుడు ఎక్కడున్నాడో.'

'భానుమతి దూరపు బంధువు బుచ్చిరాజు, మందు కొట్టేసి తానీషాలా ఎక్కడ జోగుతున్నాడో?'

'భానుమతితో బి. ఎస్‌సి. చదివిన సులోచనారాణి చెయ్యి పట్టుకుని సరసాలాడిన సైంటిస్టు ఆచారిగాడెక్కడున్నాడో?'

ఆలోచనలు వలయాకారంగా తిరుగుతున్నాయి.

ముష్టివాడు యాచన ఆ రోజుకి ఆపేసి, చిల్లర పైసలు నాయుడు చేతికిచ్చి, మూడు రూపాయి నోట్లు అందుకున్నాడు.

నాయుడు గల్లాపెట్టెలోని డబ్బు లెక్క చూసుకుంటున్నాడు.

జోరుగా వచ్చిన హెరాల్డ్ కారు చప్పుడు చెయ్యకుండా హోటల్ పక్కన తారురోడ్డు మీద డేగలా వాలింది.

చిట్టచివరి ప్రయత్నంగా నాయుడుని ఓ పాతిక పైసలు అప్పుగా అడిగి సెకండ్ షోకి వెళదామని నిశ్చయించుకున్న వెంకటగిరి అప్రయత్నంగా కారుకేసి చూశాడు.

ఆశ్చర్యంతో వెంకటగిరి కళ్ళు పెద్దవయ్యాయి.

సన్నగా, పొడుగ్గా, నడుస్తూ న్నప్పుడు వీపు ఎడంపక్కకి కాస్త వంచి అడుగేసే ఆచారిగాణ్ణి తను ఎంతదూరం నుంచయినా గుర్తుపట్టగలడు.

'వడివడిగా పోయి మేనేజర్ని రూమ్ కోసం కాళ్ళు అడుగుతున్నాడు. పిల్లా పిచికాతో ఎటో వెళుతూ రాత్రికి ఇక్కడ మకాం వేస్తున్నాడు' అనుకున్నాడు వెంకటగిరి.

పలకరించటానికి వెంకటగిరి కొట్టు దగ్గరనించి రెండడుగులు కారుకేసి వేశాడు.

డ్రైవర్ కార్లోంచి దిగి సిగరెట్ కోసం నాయుడు కొట్టుకి వచ్చాడు.

ఎర్రని ఫ్రాక్ తొడుక్కున్న ఎనిమిదేళ్ళ పాప కారులోనించి దిగి ఆచారికేసి వెళ్ళింది.

వెంకటగిరి కళ్ళలో కాలేజీ రోజుల్లో కెమిస్ట్రీ లాబ్‌లో సులోచన చెయ్యి పట్టుకున్న ఆచారి మెదిలాడు.

వాడికి ఎనిమిదేళ్ళ పాప ...

నియాన్ లైట్ వెలుగులో చిట్టి అడుగులు వేస్తూ, ఉంగరాల జుత్తు చేత్తో వెనక్కి తోసుకుంటూ నడుస్తూంది.

కుతూహలాన్ని అణచుకోలేక వెంకటగిరి డ్రైవర్ని ఎక్కణ్ణించి వస్తున్నారో కనుక్కున్నాడు.

బాబుగారు డైరెక్టర్‌గా భువనేశ్వర్ రీజినల్ రీసెర్చి లేబొరేటరీకి బదిలీ అయ్యారని, హైదరాబాద్‌నుంచి వస్తున్నారని వాడు వచ్చీరాని తెలుగు, హిందీ యాసతో చెప్పటానికి నానా హైరానా పడ్డాడు.

"ఒరేయ్, గిరీ!" హోటల్ మెట్లు మీంచి ఆచారి వెంకటగిరిని చూసి బిగ్గరగా పిలిచాడు.

వరహాంగాడి పిచ్చి బుద్ధి, అంతస్తు పెరిగినా, ఆడపిల్లల వెంటపడినా ఆచారి గాడికి ఓ రవ్వంతయినా లేనందుకు వెంకటగిరికి ఆనందం కలిగింది.

ఆచారి హాండ్ షేక్ చేస్తున్నప్పుడు చాలా ఏళ్ళయిన తరవాత కలిసిన ఆనందం వాడిలో కనిపించింది.

"మా అమ్మాయిని చూశావా, వాళ్ళ అమ్మలా బహు పెంకి. పేరు రాణిమహారాణి."

పాపని ముద్దుపెట్టుకుని ఆచారి కారు బాక్ డోర్ తెరిచాడు.

"రాణీగారూ, ఇక పల్లకీలోంచి దిగండి" అంటూ భార్యకి దిగటానికి చెయ్యందించి, "ఐ హోప్ ఎ ప్లెజెంట్ సర్‌ప్రయిజ్ ఫర్ యూ!" అన్నాడు వెనకాల నుంచున్న వెంకటగిరితో.

కర్టెన్ తప్పించిన చేతుల కున్న గాజులు గలగలమన్నాయి. కాని, ఆమె దిగలేదు.

"దిగవోయ్, బాబూ! ఇక్కడుంది మన గుడ్ ఓల్డ్ ఫ్రెండ్ మిస్టర్ వెంకటగిరి."

డ్రైవర్ డిక్కీలోని సామానంతా గబగబా లోపల పెట్టేస్తున్నాడు.

వెంకటగిరిలో హఠాత్తుగా అనుమానం కలిగింది.

"ఈమె కొంపతీసి ..."

"భానూ, త్వరగా దిగు." ఆచారి కంఠంలో విసుగు ధ్వనించింది.

ఎలక్ట్రిక్ షాక్ తిన్నట్టుగా అదిరి పడ్డాడు వెంకటగిరి.

అది చూసిన ఆచారి గట్టిగా నవ్వాడు.

"పోల్చేశావ్ అన్న మాట. సిల్లీ గర్ల్. అనంతపురం వెళుతున్నానని చెప్పి తిన్నగా హైదరాబాద్ వచ్చేసింది."

ఎప్పట్లా డబడబా వాగేస్తూన్న ఆచారి హఠాత్తుగా బ్రేక్ వేసినట్టు ఆగిపోయాడు. మొహంలో నవ్వు చెరిగిపోయింది.

వెంకటగిరి నోట మాట రాలేదు.

భానుమతి కార్లోనుంచి దిగనూలేదు.

... ఒకటి, రెండు, మూడు నిమిషాలు గడిచిపోయాయి. పాప, "నాన్నా, నాన్నా" అంటూ హోటల్‌కేసి చూపిస్తూ ఆచారి కోటు లాగుతూంది.

ఆచారి ఆశ్చర్యంగా తల వంచి కారు బాక్ సీట్లోకి చూశాడు. అతని చెయ్యి పట్టుకుని నింపాదిగా భానుమతి కార్లోనించి బైటకు దిగింది.

ఒక్క క్షణం వెంకటగిరి గుండెలు తటపటా కొట్టుకున్నాయి. ముష్టి రాక్షసుడికోసం నాయుడు కొట్టిన సోడా కీచుమని అరిచింది.

వెంకటగిరి రక్తం గడ్డకట్టింది. కళ్ళు తిరిగిపోయాయి.

'ప్రపంచం అంతా భగభగ మండి తగలడిపోదేం?'

'సముద్రం విరుచుకుపడి ఊరు ఊరంతటినీ పొట్టన పెట్టుకోదేం?'

'ప్రళయ ఝంఝామారుతం ఈ చలిచీమల్లాంటి మనుషుల్ని దుమ్ములా రేపుకుపోదేం?'

'నింగినున్న చుక్కలు నెత్తురు కక్కుకుంటూ రాలిపోవేం?'

బంగారు బొమ్మలా, మెరుపు తీగలా,

**రాత్రి**

భూమి సూర్యునినుంచి తిరోగమిస్తూ మానవునకు రాత్రిని ప్రసాదిస్తుంది.

—యంగ్

**అవసరం**

ప్రతి వ్యక్తి అవసరాన్ని ఉపాధ్యాయునిగా పరిగణించుకోవచ్చు.

—ల నోక్

అమరలోకంనుంచి దిగి వచ్చిన అప్సరసలా, మహారాణిలా, రాచకన్నెలా అప్పుడే యౌవనం వచ్చిన ఆడపులిలాంటి భానుమతి స్థానంలో ...

'గుంటలు పడ్డ కళ్ళు, పాలిపోయిన ఒళ్ళు, వెంట్రుక లూడిపోయిన బట్ట తలలోంచి వేలాడుతున్న ఎలిక తోక, ఎడం పక్కకి ఈడ్చేసినట్టున్న వంకర తిరిగిన మందపాటి పెదాలు ...'

"ఏమిటలాచూస్తున్నావ్? భానుమతీ! పాప పుట్టినప్పుడు పెరాలిసిస్ స్ట్రోక్ వచ్చిందిలే. చాలా డాక్టర్లకి చూపించాను. కాలు కాస్త బాగయింది. ఏయ్, పాపా! అమ్మని తీసుకెళ్ళమ్మా!" అని కారు బాక్ డోర్ తీసి, బాక్ సీట్లోని ట్రాన్సిస్టర్ పట్టుకున్నాడు ఆచారి.

వెంకటగిరి స్థాణువులా నిలబడ్డాడు.

"రేపు పొద్దుట తొమ్మిదింటికి ఇక్కడ స్టార్ట్ అవుతాం. రూమ్ నంబర్ ఎయిట్. మార్నింగ్ ఎర్లీగా వస్తావు కదూ?"

భానుమతి భుజంమీదుగా చెయ్యేసి నడిపించుకు తీసుకెళ్తున్న ఆచారి సగం సగం నెరిసిన జుత్తుమీద లైటు వెలుగు ప్రతిఫలిస్తోంది. అలవాటు ప్రకారం కుడిచెంప రాసుకుంటూ హోటల్ వెళ్ళిపోయాడు.

వెంకటగిరి వెనక్కి తిరగకుండా సెంటర్లోకి నడిచాడు. ఆ తరవాత కుడి పక్కకి తిరిగి, పోలీస్ స్టేషన్ మీదుగా రూమ్‌కి దారితీశాడు.

రోడ్డంతా నిశ్శబ్దంగా ఉంది. ఉండిఉండి రిక్షా బెల్ చప్పుళ్ళు వినిపిస్తున్నాయి.

సీతారామస్వామి కోవెల్లో దయానంద స్వామిగారు ఉపన్యాసం ఇస్తూ, నిద్ర పోతున్న భక్త శిఖామణులను మేల్కొలపటానికి గొంతు ఇంకాస్త బిగ్గర చేసి ఉపన్యాసం మళ్ళీ మొదలుపెట్టారు.

"'సౌఖ్యంతు బిందుమాత్రేణ దుఃఖః పర్వత మేవచ!' అని శంకరులు చెప్పనే చెప్పి ఉన్నారు. ఈనాడు యౌవనమందు అతి ఆనందముగా ఎగిరెగిరి అనుభవించు సుఖములు, రేపు బొత్తిగా మాసిపోవుచున్నవి. ఈ నాడు సుందరమని భావించు శరీరము, రేపు జరచే, వార్ధక్యముచే ముకుళించుకుపోయి మాసిపోవుచున్నది. దృశ్య విషయములందు ఉన్నది సుఖము కాదు, అభాస సుఖము. అని అవిచ్ఛిన్న పూర్ణ సుఖము ఒక్క ఆత్మయందే కలదు."

బరువుగా అడుగులువేసి పోతున్న వెంకటగిరి క్షణం మందిరం వెలుపలే నిలబడి, తిరిగి దారి సారించాడు.

మనిషి మనస్సునీ, సౌందర్యాన్నీ, కోరికల్నీ, దరిద్రాన్నీ, అతని రాగాన్నీ, ద్వేషాన్నీ, అల్పత్వాన్నీ, బొమ్మరిళ్ళనీ, వెంకటగిరినీ, ఆగకుండా ప్రవహించే నాగావళీ నదినీ, తల్లి ఒడిలో ఆదమరిచి నిద్రపోతున్న చంటిపిల్లాడి లాంటి ఊరిని చూస్తున్న నక్షత్రం చిన్నగా నవ్వుకుని కాంతి వంతంగా వెలిగింది.

రూమ్ చేరుకుని, చిరుగులు పట్టిన పాత గాబర్డిన్ సూట్ విప్పేసి, దీపం ఆర్పేసి, కిటికీచువ్వల్లోంచి కాంతి సముద్రంలా కనిపిస్తున్న ఆకాశంకేసి చూసిన వెంకటగిరి ఫస్ట్ షో సినిమా వదిలేసి చాలా పేపయిందనుకున్నాడు. ★



# తమాలపత్రం

—మరుపల్లి లక్ష్మణస్వామి

'ఖగపతి అమృతము తేగా ... పొగ చెట్టయి జన్మించెను. పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్! ...

'తమాల పత్రం పరమం పవిత్రం, రస్పార్గ ధైర్యత్తులసీ సమానమ్, ప్రభు ప్రియం కృష్ణముఖోద్గతం, తదైవ్యష్ణవాగ్రై: పరిసేవనీయమ్'.

పై సుదహరించబడిన కవి వాక్యాలు పొగ త్రాగేవారికి కర్ణపేయంగా ఉంటాయి. గరుడుడు తెస్తూ ఉన్న అమృతంలో కొన్ని బిందువులు భూమిపై పడి పొగ చెట్టుగా జన్మించాయట! పొగాకు పరమ పవిత్రమైనదట!

అంతేకాదు ఇంకో కవి పొగాకుచేత ఇలా చెప్పించాడు.

'... సహితవ విదితం? శ్రీ కవిదేవ రాజ్ఞః చాతుర్వర్ణ్యం విధాత్రా వివిధ విరచితం పావనం ధర్మ హేతో రేకీకర్తుం బలాత్తన్నిఖిల జగతి రే! శాసనా దాగతో స్మి'—నేను కవి మహారాజు దూతను. నాలుగు జాతుల వారినీ నన్ను భక్షిస్తున్నట్లు చేసి, ఒకటిగా చేయుటానికే ఈ ప్రపంచంలో అవతరించాను' అని భావం.

ఈనాడు ప్రపంచంలో పొగాకు ప్రవేశం లేని ప్రాంతమే లేదని అనుకోవచ్చు. చుట్ట, బీడీ, సిగరెట్, హుక్కా, నశ్యం, భంగి, తంగభస్మం, ఖారా కిళ్ళీ మొదలైన అనేక రూపాల్లో సాక్షాత్కరిస్తున్న పొగాకు తరతమ వ్యత్యాసం లేకుండా పసివాళ్ళు మొదలు పండు ముదుసలి వరకూ, కార్మికులు మొదలు గవర్నర్ల వరకూ కోటాను కోట్ల మందిని బానిసలుగా చేసుకున్నది.

అనాదినుండీ పొగాకు తన భయంకర విషంతో మానవజాతికి నష్టం కలిగిస్తూనే ఉన్నదిగాని, క్రీ. శ. 1492 వరకూ దాని ఉపయోగం అమెరికా దేశపు ఆదిమ నివాసులలోనే పాదుకొని ఉన్నట్లు చరిత్ర చెబుతున్నది.

1560 లో స్పెయిను దేశపు రెండవ ఫిలిప్ ద్వారా యూరప్‌లో పొగాకు నాటబడింది. 1605 లో పోర్చుగీసు వారు మన దేశానికి పొగాకును తీసుకొనివచ్చారు.

దాదాపు అన్ని వర్గాల వారి ఆదరణ చూరగొన్న ఈ పొగాకు వినియోగదార్లకు ఏం మేలు చేస్తున్నదీ ఎవ్వరూ సరిగా చెప్పలేరు. కొంతమంది పొగతాగితే హుషారుగా ఉంటుందనీ, విసుగుదల తగ్గుతుందనీ అంటారు. కొంతమంది కాలక్షేపానికీ, ఫాషన్‌కోసం సిగరెట్ తాగుతుంటారు. చుట్ట కాలిస్తే ఉబ్బసం తగ్గుతుందని కొందరు గ్రామస్థులు చెబుతారు.

అయితే, పొగాకువల్ల కలిగే హాని అపరిమితం.

ఒక పౌను పొగాకులో 380 వడ్లగింజల ఎత్తు 'నికోటిన్' అనే విషం ఉంటుంది. ఇందులో 10 వ వంతు విషం మూడు నిమిషాల్లో ఒక కుక్కను చంపగలదు.

ఒక చుట్ట లేదా సిగరెట్ పొగాకులోగల 'నికోటిన్' విషం ఇద్దరు మనుషుల్ని చంపగలదు.

పొగాకులో నికోటిన్ మాత్రమేగాక పైరిడిన్, పికోలిన్, కొలిడిన్ అను వాయువులూ, కార్బలిక్, కార్బన్ డై ఆక్సైడ్, బెంజీన్, ప్రస్సిక్ ఆసిడ్, హైడ్రోయానిక్ అనే ద్రావకాలు మొదలైనవి జనిస్తున్నాయి.

సిగరెట్ పై కాగితం కాలేటప్పుడు 'ఆక్రోలిన్' అనే మరో రకమైన విషం ఉత్పత్తయి పొగ తాగువారికి తీరని అపకారం చేస్తూ ఉన్నది.

పొగతాగటం వల్ల కడుపులో పుండ్లు పుడతాయి - కడుపులో ఆసిడ్ ఏర్పడుతుంది, 'థైరాయిడ్ గ్లాండు'కు మిక్కిలి హాని కలుగుతుంది.

ఈ దురలవాటు ఎక్కువైనకొద్దీ జీర్ణశక్తి మందగిస్తుంది. జ్ఞాపకశక్తి తగ్గుదల, గుండె బలహీనమగుట, కనుచూపు తగ్గుట, నిస్త్రాణ వంటివి సంభవిస్తాయి.

క్రమేణా రక్తం వలననైక్షయ, పక్షవాతం మొదలైన రోగాలు సంభవిస్తాయి.

పొగాకు విషప్రభావం జననేంద్రియాలపై కూడా పడి స్త్రీ పురుషులను సంతానహీనులుగా చేస్తూ ఉన్నది.

పొగ తాగినవారికి చిట్టచివరకు ఉన్మాదం, మరణం—ఈ రెండూ స్వాగతమిస్తాయి.

పోతే, పొడుం పీల్చేవారి గతి.

'నశ్యం పండిత లక్షణం; ... నేత్రద్వయం నాశనం' అనీ, 'పొడి పీల్చుచున్న నెత్తురు చెడు, మొగమున నిగలు గల్గు, చెమ్మట తలపై వెడలెడును, శ్వాసకోశము, సడలున్, పీనసయు బుట్టు ..." అనీ అన్నారు.

ఆధునిక ప్రపంచంలో పొగాకు వినియోగం అప్రతిహతంగా ఉన్నది. అయితే, సుమారు 25 సంవత్సరాల క్రితం వేయబడిన అంచనాల దాఖలా, ఒక్క కాన్పూరు నగరంలోనే రోజుకు 25 లక్షల సిగరెట్లు, 104 లక్షల బీడీలు వినియోగం చేయబడుతున్నట్లు తేలింది. అందుకుగాను రోజుకు రు. 81,250 లు ఖర్చు అవుతూండేదట! ఆ సిగరెట్లు, బీడీల పొగతో విషమయమైన వాయుమండలం 52 లక్షల మనవు టదుగులు వ్యాప్తమై ఉండేది!

ఈ లెక్కల ప్రకారం ఈనాడు దేశంలోని పట్టణాల్లోను, సుమారు 6 లక్షల గ్రామాల్లోను ఎన్ని కోట్ల విలువైన పొగాకు వాయుమండలాన్ని కలుషితంచేస్తూ, ఎన్నికోట్ల మంది ప్రజల ఆయుర్దాయాన్ని క్రమేణా క్షీణింపచేస్తున్నదో అంచనా వేయగలమా అనే సందేహం కలుగుతూంది.

పొగాకు వాడకంలో ప్రపంచంలోని అన్ని దేశాల కంటె దక్షిణ ఆఫ్రికా